పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకం?

- రెండేళ్లలో 9 పాఠశాలల మూత
- ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులు



ఈ ఏడాది తెరిచి ఉంచిన రంగంపేట ప్రాథమిక పాఠశాల



విద్యార్థులు లేక మూతపడిన బావులకాడి తండా ప్రాథమిక పాఠశాల

ఉప్పునుంతల: పాతికేళ్ల కిందట పేద, ధనిక భేదాలు లేకుండా విద్యార్థులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేవారు. ఎక్కడో పట్టణాల్లో మినహాయిస్తే ప్రైవేట్ పాఠశాలలు ఉండేవికావు. కాల క్రమేణా విద్యే వ్యాపారంగా మారడం, ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకరావడం, ఇంగ్లీష్ మీడియంపై మక్కువ పెరగడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడానికి ఇష్టపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తే తమస్థాయి ఎక్కడ తగ్గుతుందోనని ప్రైవేట్ పాఠశాలల వైపే ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది పూర్తిగా తగ్గిపోవడంతో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. జెడ్పీహెచ్‌ఎస్‌ల స్థాయిలో విద్యార్థుల సంఖ్య ఓ మాదిరిగా ఉన్నా పీఎస్‌లు, యూపీఎస్‌లలో మాత్రం విద్యార్థుల సంఖ్య పూర్తిగా తక్కువగా ఉంది. ఈ క్రమంలో విద్యార్థులు లేక మండలంలో కొన్ని పాఠశాలలు మూతపడగా మరికొన్ని అదే బాటలో కొనసాగుతున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఐదు తరగతులకుగాను ఒకే ఉపాధ్యాయుడిని నియమించడంతో విద్యార్థులకు సరైన బోధన అందడానికి అవకాశం లేదు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి ఇష్టపడటం లేదు. ప్రధానంగా ఆ సమస్యతోనే ఏకోపాధ్యాయ పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయి. మండలంలో మొత్తం పాఠశాలలు 43 ఉండగా వాటిలో 4 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 7 యూపీఎస్‌లు, 30 పీఎస్‌లతోపాటు ఉప్పునుంతల కేజీబీవీ, వెల్టూరు బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయి. గతేడాది ఆయా పాఠశాలల్లో మొత్తం విద్యార్థులు 2741 మంది ఉన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు బడిబాటలో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తున్నారు.

రెండేళ్లుగా తొమ్మిది పాఠశాలల మూత

మండలంలో ఉన్న 30 ప్రాథమిక పాఠశాలల్లో రెండేళ్లుగా విద్యార్థులు లేక తొమ్మిది పాఠశాలలు పూర్తిగా మూతపడ్డాయి. వాటిలో రంగంపేట, కాంసానిపల్లి తండా, గుట్టమీది తండా, అయ్యవారిపల్లి తండా, మూన్యతండా, ఫిరట్వానిపల్లి తండా, సీబీ తండా, బావులకాడి తండా, వెల్టూరు తండా పాఠశాలలు ఉన్నాయి. మూతపడిన పాఠశాలల ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రస్తుతం మూతబడిన పాఠశాలలను మూడు రోజులుగా తెరిచి ఉంచారు. ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటం లేదు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు తమ పిల్లలను పంపించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపడంలేదు. ఈ ఏడాది కూడా విద్యార్థులు రాకపోతే ఆయా పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉంది. గ్రామాల్లో విద్యార్థులు లేక పాఠశాలలు మూతబడితే ఉన్న ఉపాధ్యాయ పోస్టులు శాశ్వతంగా రద్దయ్యే పరిస్థితి ఉంది. ఒకసారి పాఠశాలను ఎత్తివేస్తే తిరిగి తెచ్చుకోవడం కష్టమని ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు చెబుతున్నా ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. మారుమూల తండాలు, గ్రామాల నుంచి బస్సుల ద్వార ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను చేరవేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలకు ఈ పరిస్థితి దాపురించింది.

"పాఠశాలలను తెరచి ఉంచాం ..



గతేడాది మూతబడిన పాఠశాలలను ఈ ఏడాది తెరిచి ఉంచాం. ఆయా గ్రామాల్లో టీచర్లు ఇంటింటికి తిరిగి విద్యార్థులను పాఠశాలకు పంపించమని తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నారు. కనీసం ఇద్దరు ముగ్గురు విద్యారులు వచ్చినా పాఠశాలను కొనసాగించే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు విద్యార్థులు పాఠశాల ల్లో చేరిన సమాచారం అందలేదు. ఒక వేళ విద్యార్థులు చేరకంటే ఆ స్కూల్ టీచర్‌ను ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపిస్తాం. ఏకోపాధ్యాయ పాఠశాలలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు ఇష్టపడటంలేదు. దీంతో పాఠశాలలు మూతపడడానికి ప్రధాన సమస్యగా మారింది.

– చంద్రశేఖర్, ఎంఈఓ,ఉప్పునుంతల

క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

అచ్చంపేట రూరల్: కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ నెల 5వ తేదీ వరకు పట్టా పాస్ బుక్‌లు పొందిన రైతులు రైతు భరోసా పథకం కోసం దర ఖాస్తు చేసుకోవాలని ఏఓ కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 20వ తేదీ వరకు గడు వు ఉందని తెలిపారు. రైతులు బ్యాంక్ అకౌంట్ మార్చుకునేందుకు కూడా అవకాశం పేర్కొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు సీఎం హామీపై హర్షం

మన్ననూర్: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో హామీ ఇవ్వడంపై ఆర్యవైశ్య రాష్ట్ర కార్యదర్శి సంబు వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని లక్డికాపూల్ చౌరస్తాలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం చేసిన ప్రకటనపై సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీలు ఎంఏ రహీం, దాసరి శ్రీనివాసులు కోరారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉండి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలు గెలిచేందుకు కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే పనితీరుకు గుర్తించి ఉన్నతమైన సముచిత స్థానం కలించి గౌరవించాల్సిన అవసరం కాంగ్రెస్ అధిష్ఠానంపై ఉందన్నారు. కార్యక్రమంలో మంతటి రవి బాలమ్మ, సంబు శోభ వెంకటరమణ, పంబలి బుచ్చయ్య, హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణ, శివాజీ, వెంకటయ్య, రమణ, జాఫర్, శ్యాం సుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ అందజేత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వడ్డెర బస్తీలో ఉన్న అంగన్‌వాడీకి ఫ్యాన్, రెండు కుర్చీలు మిత్ర ఫౌండేషన్ సభ్యులు శనివారం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చంద్రకాంత్ రెడ్డి, అధ్యక్షుడు రసూల్ ఖాన్, సభ్యులు నరేష్, శ్రీకాంత్, శ్రీనేష్ గౌడ్, సలీం ఖాన్, కార్తీక్, తరుణ్, అరవింద్, మహేష్ పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని జంగారెడ్డిపల్లి, కురుమిద్ద తండాలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన మెడికల్ కిట్లను శనివారం గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ మండల మహాసభ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ మండల సభ నిర్వహిస్తునట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కల్వకోలులో ఏర్పాటు చేసిన పార్టీ గ్రామసభలో ఆయన మాట్లాడారు. మహాసభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలనికోరారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా ప్రకాష్, శేఖర్, కోశాధికారిగా బాలస్వామి, సలహాదారుడిగా లక్ష్మీనారాయణ పాటు 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యేసయ్య, విజయుడు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, కుర్మయ్య పాల్గొన్నారు.

చే గువేరాకు ఘన నివాళి



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో చే గువేరా 97వ జయంతిని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు మాట్లాడుతూ క్యూబా విప్లవంలో చేగువేరా కీలక పాత్ర పోషించి నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నాయకులు మల్లికార్జున్, నవిన్, రాజు, శ్రీశైలం, రవి, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శనివారం క్యూబా విప్లవ సేనాని చే గువేరా జయంతిని నిర్వహించారు. సీపీఐ నాయకులు గోపాల్, మల్లేష్, పరందాములు, ఆటో కార్మికులు హరి సింగ్, వెంకటేష్, జగన్, అశోక్,పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

పెంట్లవెల్లి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్ అన్నాడు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

వెల్దండ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా మారిందని కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ అన్నారు. శనివారం పెద్దాపూర్ గ్రామానికి చెందిన మల్కేడి శ్రీనువాస్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.51వేల చెక్కును ఆయన లబ్ధిదారుడికి అందజేశారు. నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీను, ఆంజనేయులు,రాములు, తిరుపతినాయక్, ప్రవీణ్‌నాయక్, విజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఉన్నారు.

టీయూడబ్ల్యూజే ఐజేయూ మండల కమిటీ ఎన్నిక

తెలకపల్లి: మండల కేంద్రంలో శనివారం టీయూడబ్ల్యూజే ఐజేయూ సమావేశాన్ని ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షుడు యాదగిరి, కొండకింది మాధవరెడ్డి సమక్షంలో మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింత కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా కోట్ల శ్రీనివాసులు, మల్లేష్‌బాబు, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా శివ, సహాయ కార్యదర్శిగా సాంబశివుడు, రాఘవేందర్, కార్యవర్గ సభ్యులుగా భరత్‌కుమార్, రమేష్, రెడ్డపాకుల రమేష్, పరమేష్, ఎల్లస్వామి, శంకరయ్యను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కేజీబీవీల్లో జనరల్ కోర్సులు ప్రవేశపెట్టాలి

కొల్లాపూర్: కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో జనరల్ కోర్సులను ప్రవేశపెట్టాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు ధార శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీల్లో అధిశాతం ఒకేషనల్ కోర్సులను మాత్రమే ఉన్నాయని దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు రాము, శివ, వెంకట్ తదితరులు ఉన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి

బల్మూర్: మండల కేంద్రం సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు సంబంధించిన భూనిర్వాసిత రైతులు శనివారం హైదారాబాద్‌లోని ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. రిజర్వాయర్ నిర్మాణం వల్ల చెంచు గిరిజన రైతుల భూములతో పాటు పేద సన్న, చిన్నకారు రైతులు భూములు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. రఘుమారెడ్డి, వెంకటస్వామి, ఇంద్రారెడ్డి, బాలస్వామి, నాగయ్య, అనిల్‌రెడ్డి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

నీట్‌లో గిరిజన విద్యార్థిని ప్రతిభ

లింగాల: మండల కేంద్రానికి చెందిన పూజారి శ్రీదేవి, సురేందర్ కుమార్తె కుమారి పూజారి హాసిని శనివారం ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చింది. ఆల్ ఇండియా ర్యాంక్‌లలో 377, ఎస్టీ జనరల్ కేటగిరిలో మూడో ర్యాంక్, ఎస్టీ ఉమెన్ కోటాలో మొదటి ర్యాంక్‌ను సాధించింది. నీట్‌లో ప్రతిభ కనబర్చిన గిరిజన విద్యార్థినిని పలువురు అభినందించారు.

'రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు'



అచ్చంపేటలో ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీపై సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ ఛత్రునాయక్ డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లోని ఎస్‌ఐ విజయభాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఛత్రునాయక్ మాట్లాడుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ రూపేష్ సింగ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, గౌరీశంకర్, లక్ష్మణ్, పవన్, ఖాదర్, రఫీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

తాడూరు: ప్రజా సమస్యలపై నిరంతర పోరాడుతామని రాష్ట్ర సమితి సభ్యుడు వార్ల వెంకటయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఒక్కరు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, సీపీఐ నాయకుడు రాంచంద్రయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ సీపీఐ నాయకులు రాంచంద్రయ్య, సత్యం, కురుమూర్తి రాములు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని పెరికే భవన్‌లో మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎగ్ బిర్యానీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజాభవన్‌లో ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువు నేర్పించడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి.. ఎగ్ బిర్యానీ వడ్డించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ బీరం మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆకుల లావణ్య, క్యాంప్ మల్లయ్య, ఐసీడీఎస్ ఏసీడీపీఏ కమల, సూపర్‌వైజర్లు అమృత, సువర్ణ, రాజేంద్ర, స్వర్ణలత, సునీత పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి



తాడూరు మండలం గుట్టలపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

తాడూరు: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని పార్లమెంట్ సభ్యుడు మల్లురవి అన్నారు. శనివారం గుట్టలపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్‌తో రైతులు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడ్డారన్నారు. ధరణితో నష్టపోయిన రైతులు మళ్లీ ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందదర్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జయంతి, మాజీ చైర్మన్ వల్లభ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితంస్ఫూర్తిదాయకం

తాడూరు: అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎంపీ మల్లురవి అన్నారు. శనివారం మండలంలోని గుట్టలపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. రాజ్యాంగ ఫలా లు అందరికి అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ధర్మరాజు, నిరంజన్, వల్లబ్‌రెడ్డి, వెంకటస్వామి, చంద్రమౌళి, డీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఎమ్మెల్యే



అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

కందనూలు: హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఎక్కువ మొత్తంలో బ్లడ్ యూనిట్స్ సేకరించినందుకు జిల్లాకు ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు కూడా రక్తదానం చేసి ఇంకొకరి జీవితంలో వెలుగులు నింపాలన్నారు. అవార్డు రావడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

భారత్ శక్తివంతమైన దేశం



మాట్లాడుతున్న మండే కార్ బాలాజీ

కల్వకుర్తి రూరల్: ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచంలోనే భారత దేశాన్ని శక్తివంత దేశంగా తీర్చిదిద్దారని బీజేపీ రాష్ట్ర నాయకుడు మండి కార్ బాలాజీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో కేంద్రంలో ప్రధానిగా నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మండకార్ బాలాజీ మాట్లాడారు. ప్రధాని మోడీ చేస్తున్న విశేష కృషితో దేశ జీడీపీ నాలుగో స్థానానికి చేరుకుందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ ఆయుధ శక్తి ప్రపంచానికి చూపించారన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులను సన్మానించారు. కృష్ణ గౌడ్, బండేల రామచంద్ర రెడ్డి, నరెడ్ల శేఖర్ రెడ్డి, సురేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి, మల్లేష్, లింగారెడ్డి, సైదులు గౌడ్, సురేష్ గౌడ్, సంతోష్ నాయక్, శివ, ఆనంద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న రజక, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

లింగాల: రజక, నాయి బ్రాహ్మణ వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రజక వృత్తిదారుల మండల సంఘం అధ్యక్షుడు గౌరయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో సంఘం సభ్యుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల వృత్తులు చేసుకొనే రజక, నాయీ బ్రాహ్మణులకు ఏడాదిన్నర నుంచి విద్యుత్ బిల్లులు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. దీంతో కులవృత్తులు చేసుకునేవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్, శ్రీనివాసులు, బాలీశ్వర్, నర్సిహ్మా, రవి, లక్ష్మయ్య, అశోక్, మధు, రంజిత్, భాస్కర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం



కొల్లాపూర్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి ఉపనిషాద్వని

కల్వకుర్తి టౌన్: రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం అవుతాయని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో జూనియర్ సివిల్ కోర్టు జడ్జితో కలిసి ఆమె పాల్గొన్నారు. కల్వకుర్తి కోర్టు పరిధిలో 819 కేసులలో కక్షిదారులు రాజీ కుదిరిందని జడ్జి తెలిపారు. సీనియర్ సివిల్ కోర్టు, జూనియర్ సివిల్ కోర్టులో వివిధ కేసులలో జరిమానా విధించినట్లు ఆమె పేర్కొన్నారు. సెకండ్ క్లాస్ కోర్టు కేసులలో భాగంగా 723 కేసులలో రూ.2.63 లక్షలు జరిమానాలు విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు పరిధిలోని పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 931 కేసుల పరిష్కారం

కొల్లాపూర్: పట్టణంలో జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 931 కేసులు పరిష్కారం అయ్యాయి. మెజిస్ట్రేట్ ఉపనిషాద్వని సమక్షంలో కక్షిదారులు రాజీపడ్డారు. సివిల్, సైబర్‌క్రైం, డ్రంకెన్‌డ్రైవ్, బ్యాంకు బకాయిలకు సంబంధించిన కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నపాటి తగదాలు, వివాదాల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి కోర్టులు చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దన్నారు. రాజీమార్గాన్ని అనుసరించి వాటిని ఇరువురు కక్షిదారులు పరిష్కరించుకోవడం ద్వారా అందరికీ మేలు జరుగుతుందన్నారు. కక్షిదారులకు మేలు చేసేందుకే లోక్‌అదాలత్‌ను న్యాయశాఖ ఏర్పాటుచేసిందని వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మోహన్‌లాల్, ఆర్.కురుమూర్తి, లోక్‌అదాలత్ కోఆర్డినేటర్ భోగా హరికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోతుల నాగరాజు, న్యాయవాదులు కర్నె శ్రీహరి, శివారెడ్డి, నిరంజన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉచిత సీట్లను సాధించారు. శనివారం ఎంఈఓ బషీర్ అహ్మద్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. స్వదస్‌దీప్‌సింగ్(హైదరాబాద్), కె.శివ(వీపనగండ్ల), ఎం.యశ్వంత్(అంబట్‌పల్లి), ఎం.ప్రణీత(ఇబ్రహీంపట్నం), కె.వంశీ, వై.ఆంజనేయులు(సింగోటం), వి.శ్రీకాంత్(సంగారెడ్డి), కె. చరణ్(చిన్నచింతకుంటపల్లి) గురుకుల కళాశాలల్లో సీట్లను పొందారు.

నల్లబ్యాడ్జీలు ధరించి జర్నలిస్టుల నిరసన

కందనూలు: ఓ పత్రిక ఎడిటర్‌పై అక్రమంగా కేసు పెట్టడంతో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టు సందు యాదగిరి మాట్లాడుతూ పెద్దధన్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ దుష్ప్రభావాలపై వరస కథనాలను ప్రచురిస్తే సంపాదుకుడిపై రాజోలీ పోలీసులు కేసు నమోదు చేయడం అప్రజాస్వామికం అన్నారు. కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజోలి ఎస్ఐ జగదీశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కొండకింది మాధవరెడ్డి, హమీద్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ

తాడూరు: మండలంలోని పాపగల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శనివారం మాజీ ఎంపీటీసీ రమేష్ భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి 25 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు.



శనేశ్వరుడికి తైలాభిషేకాలు



బిజినేపల్లి: నందివడ్డెమాన్‌లోని జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం తిల, తైలాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులచే గోత్రనామార్చన పూజలు చేయించారు.

కల్యాణం.. కమనీయం



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గ్రామ సమీపంలో అప్పాద్రి గుట్టపై స్వయంభూ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవంగా వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనర్సింహ స్వామి, అండాళమ్మ ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో పూజారి గంగాధర శర్మ కల్యాణతంతు కొనసాగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లి తిరుపతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం: కేసునమోదు

బల్మూర్: మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన స్వాతి తన ఇద్దరు పిల్లలతో పాటు అదృశ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం కుటుంబాల కలహాల మధ్య భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్థాపంతో ఇంట్లో ఎవరులేని సమయంలో స్వాతి ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకొని ఇంటినుంచి బయటకు వెళ్లింది. ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భర్త కాంత్రికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.